క్లుప్తంగా

కార్పొరేషన్ రుణ లబ్ధిదారులకు రేపు ఇంటర్వ్యూలు

అంబాజీపేట: వివిధ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 3న అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. మండలంలో వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 1,397 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. 3న ఇండియన్ బ్యాంక్ నేదునూరు పరిధిలో పసుపల్లి, ఎస్‌బీఐ ముక్కామల పరిధిలో ముక్కామల, 10 గంటలకు యూనియన్ బ్యాంక్ పుల్లేటికుర్రు, 12 గంటలకు యూనియన్ బ్యాంక్ పరిధిలో గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు ఎస్‌బీఐ అంబాజీపేట బ్యాంకు పరిధిలో చిరతపూడి, ఇసుకపూడి, కె.పెదపూడి, 2.30 గంటలకు వాకలగరువు, తొండవరం, నందంపూడి, 3 గంటలకు మాచవరం గ్రామాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. కార్పొరేషన్ రుణాల మంజూరు చేసుకున్న లబ్ధిదారులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

వాడపాలెం చానళ్లకు నేడు, రేపు సాగునీరు

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) వరి పంటకు వంతుల వారీగా సాగునీటి సరఫరాలో భాగంగా మండలంలోని వాడపాలెం లాకుపై ఉన్న చానళ్లకు బుధవారం, గురువారం సాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ స్థానిక సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ద్వారా మండలంలోని వాడపాలెం లాకుల పైన ఓల్డ్ వాడపాలెం, న్యూ వాడపాలెం చానళ్లకు బుధవారం సాయంత్రం 6 నుంచి గురువారం సాయంత్రం 6 గంటల వరకూ సాగునీరు సరఫరా చేయనున్నట్టు ఏఈ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయా చానళ్ల కింద కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలోని వరి ఆయకట్టుకు సంబంధించిన రైతులు వంతుల వారీ విధానంలో తమ భూములకు సాగునీరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేడ్కర్ సిఫారసుతో ఆర్‌బీఐ స్థాపన



మురళీకృష్ణ

మామిడికుదురు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హిల్టన్ యంగ్ కమిషన్‌తో జరిపిన చర్యలు, సిఫారసుల ఫలితంగా భారత రిజర్వు బ్యాంకు 1935 ఏప్రిల్ ఒకటిన స్థాపించబడిందని గోగన్నమఠం గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనమిక్స్ డాక్టర్ పెనుమాల మురళీకృష్ణ మంగళవారం పేర్కొన్నారు. రిజర్వు బ్యాంకు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్ రాసిన 'రూపాయి సమస్య, దాని మూలం, దాని పరిష్కారం' అనే వ్యాసంలో రూపాయి విలువ, బలహీనత, ఆర్థిక సంక్షేమం గురించి వివరించారన్నారు. భారత రిజర్వు బ్యాంకు ఏర్పాటులో అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత మూర్తి దంపతులకు స్వామి చిత్రపటం అందిస్తున్న పర్యవేక్షకుడు సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు అదే గ్రామానికి చెందిన గంటి మూర్తి, పద్మావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు సత్యమూర్తికి అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దాత దంపతులను అభినందించారు.

చమురు సంస్థలు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి

తాళ్లరేవు: మండల పరిధిలో చమురు సంస్థలు గ్యాస్ పైపులైన్ వేసి ప్రతి ఇంటికి ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే పేరెన్నికగన్న రెండు చమురు సంస్థలు తాళ్లరేవు మండలంలో ఉన్నప్పటికీ మండల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఆయా చమురు సంస్థల ద్వారా వెదజల్లుతున్న కాలుష్యం బారిన పడుతున్న స్థానిక ప్రజలను విస్మరించి ఇతర ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. కాలుష్యం కారణంగా గాడిమొగ, పోలేకుర్రు, తాళ్లరేవు, జార్జిపేట, నీలపల్లి తదితర ప్రాంతాల్లో కొబ్బరి దిగుబడి తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కంపెనీల నిర్మాణ సమయంలో ఆయా గ్రామ పంచాయతీలకు ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలని ఏడుకొండలు డిమాండ్ చేశారు.

భూములున్నా.. ఫలితాలు సున్నా

- అభివృద్ధికి దూరంగా సహకార సంఘాలు
- వేల సంఖ్యలో ఎస్సీ సభ్యులు
- సాగునీరు, విద్యుత్, రోడ్లు శూన్యం



శంకరగుప్తంలో ఉప్పునీటి బారిన పడి నిరుపయోగంగా ఉన్న ఎస్సీ సొసైటీ భూములు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలోని ఎస్సీ సహకార సంఘాలు అనేక ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. సముద్ర తీరంతో పాటు, గోదావరి తీరం వెంబడి ఈ సహకార సంఘాలకు చెందిన వందలాది మంది సంఘ సభ్యుల వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అవి అనాదిగా పూర్తి నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నాయి. ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా పాలకులు మారుతున్నారు తప్ప ఆ సొసైటీల తలరాతలు మాత్రం మారడం లేదు. ఈ సంఘాల్లో పట్టాలు పొందిన పేదలు పూర్తిగా ప్రకృతి పైన ఆధారపడి పండితే తినడం లేకుంటే పస్తులుండడం మాదిరి ఇక్కడ కొనసాగుతోంది.

ఇవీ ఎస్సీ సహకార సంఘాలు

మలికిపురం మండలంలో తూర్పుపాలెం, కేశనపల్లి, శంకరగుప్తం, రామరాజులంక, గుడిమెళ్లంక, మలికిపురం, దిండి, లక్కవరం, గూడపల్లి, సఖినేటిపల్లి మండలంలో కేశవదాసుపాలెం, అంతర్వేది, అంతర్వేదిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, శృంగవరప్పాడు, రాజోలు మండలంలో శివకోడు, మామిడికుదురు మండలంలో కరవాక ఎస్సీ సహకార సంఘాలు ఉన్నాయి.

వేధిస్తున్న సౌకర్యాల లేమి

ఈ సంఘాల అన్నింటికీ ప్రతి ఏడాదీ పాలకవర్గాలు నూతనంగా ఏర్పాటవుతాయి. ప్రతి సంఘంలోనూ సుమారు 200 మంది వరకూ సభ్యులు ఉన్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం ఈ సభ్యులందరికీ సముద్ర, గోదావరి తీర ప్రాంతాల్లో ఇసుక, బీడు భూములను ప్రభుత్వం పట్టాలుగా ఇచ్చింది. ఇలా పలు గ్రామాల్లో ఈ సంఘాలన్నింటికీ సుమారు 7 వేల ఎకరాల పైబడి భూములున్నట్లు అంచనా. కానీ ఏం ప్రయోజనం. ఆ భూములకు సాగునీటి సౌకర్యం లేదు. బోరు వేసుకుందామంటే విద్యుత్ సౌకర్యం లేదు. వర్షాలకు ఆధారపడి పండిన కొద్దిపాటి పంటనూ తెచ్చుకుందామంటే రోడ్డు సౌకర్యం లేదు. గోదావరి తీరం వెంబడి భూములు కోతకు గురవుతున్నాయి. అంతర్వేదిపాలెం ఎస్సీ సొసైటీ భూములకు డ్రైనేజీ సౌకర్యం లేదు. ఉప్పునీటి బారిన పడి వరి సాగు లేక అనేక సంవత్సరాలుగా బందలుగా పడి ఉన్నాయి. ఇక అంతర్వేది నుంచి కరవాక వరకూ సముద్ర తీరం వెంబడి భూముల్లో సరుగుడు తోటలు సాగవుతాయి. ఇక్కడ కూడా వర్షాధార సాగే. ఎండలకు చనిపోతూంటాయి. అలాగే ఓఎన్జీసీ బావులు కూడా ఇక్కడ ఉన్నాయి. ఆయిల్ సంస్థల ద్వారా ఇక్కడ సంఘాలకు సహాయం అందించాలనే డిమాండ్ కూడా ఉంది. ఎస్సీ సహకార సంఘాల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వెచ్చించాలనే డిమాండ్ కూడా గత కొంత కాలంగా ఉంది. ఆ పథకాలు ఎప్పటికీ వర్తిస్తాయోనని ఈ ప్రాంత ఎస్సీ సహకార సంఘాలు ఎదురు చూస్తున్నాయి.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న సీనియర్ న్యాయవాదులు

రాజోలు: బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మంగళవారం రాజోలు బార్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన యర్రంశెట్టి అయ్యప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి చింతా ప్రసాద్, ఉపాధ్యక్షుడు యాలంగి రమేష్‌లతో పాటు సంయుక్త కార్యదర్శులు గంటి రవికుమార్, నీతిపూడి సత్యనారాయణ, లైబ్రరీ కార్యదర్శి సిర్రా వెంకటేశ్వరరావులతో పాటు కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాజీ ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్ 2024–25 ఏడాదికి సంబంధించిన జమా ఖర్చులను సభ్యులకు వివరించారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది సత్తిరాజు వెంకటేశ్వరరావును సత్కరించారు.

సెంట్రల్ డెల్టాకు 'గుండె' లొల్ల లాకులు



లొల్ల లాకుల వద్ద సాగునీటి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: సెంట్రల్ డెల్టాకు సాగునీరు అందించడంలో లొల్ల లాకులు గుండె వంటివని, ఈ లాకుల ఆధునీకరణకు అందరం సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద మంగళవారం ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో వాటర్ డిస్ట్రిబ్యూటరీ, సాగునీటి సంఘాల సమావేశం నిర్వహించారు. సత్యానందరావు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి లేని మన జిల్లా వాసులంతా వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారని అన్నారు. ఈ వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని, తద్వారా వ్యవసాయం, రైతాంగంపై ఆధారపడిన అన్ని వర్గాల వారికి మేలు చేకూరుతుందన్నారు. ఈ అన్నింటికీ మూలమైన సాగునీటి సరఫరాకు ప్రధానమైన లొల్ల లాకులను ఆధునీకరించుకోవడం మన ముందున్న ముఖ్యమైన అంశమన్నారు. దీని కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సంబంధిత శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ప్రత్యేకంగా కలిశామన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఇందుకు పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. అలాగే మరో పక్క టూరిజంకు అనువుగా ఉన్న ప్రాంతాలు కోనసీమలో చాలా ఉన్నాయని, ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని సీఎంను, ఆ శాఖ మంత్రిని కోరామన్నారు. అందుకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయన్నారు. ఈ అంశాల పురోగతికి తనతో పాటు సాగునీటి ప్రాజెక్ట్, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు కృషి చేయాలని, రైతు సమస్యల పరిష్కారానికి సాగునీటి సంఘాలు పనిచేయాలని సూచించారు. సాగునీటి వ్యవస్థలో ఇటీవల చైర్మన్లుగా ఎన్నికైన నాయకులను ఘనంగా సత్కరించారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, రాష్ట్ర టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, గోదావరి సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఆ శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు



అయినవిల్లిలో పదో తరగతి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



అంబాజీపేటలో పది పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

అంబాజీపేట: మండలంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అంబాజీపేట, పుల్లేటికుర్రు, తొండవరం గ్రామాల్లో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, 457 మందికి 454 మంది హాజరయ్యారన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారంతో ప్రశాతంగా ముగిశాయి. మండలంలోని నేదునూరు, ముక్తేశ్వరం, కె.జగన్నాథపురం, వీరవల్లిపాలెం గ్రామాల్లోని 692 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆఖరి రోజు విద్యార్థులు ఆనందంతో పరీక్ష హాల్ నుంచి వచ్చారు. తాము మంచి మార్కులు సాధిస్తామని చెప్పారు.

శ్మశాన స్థలంలో రోడ్డు నిర్మాణంపై నిరసన



మామిడికుదురులో ధర్నా చేస్తున్న గెద్దాడ గ్రామస్తులు

మామిడికుదురు: గెద్దాడ గ్రామంలో వందేళ్ల నుంచి అన్ని కులాల వారు అంత్యక్రియలు నిర్వహిస్తున్న శ్మశాన స్థలంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల నిర్వహణపై గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జాతీయ రహదారుల విభాగం అధికారుల తీరును నిరసిస్తూ ధర్నా చేశారు. వినియోగంలో ఉన్న శ్మశానానికి ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారంటూ ఆందోళన తెలిపారు. శ్మశాన స్థలంలో రోడ్డు నిర్మాణం చేపట్టరాదంటూ పంచాయతీ చేసిన తీర్మానానికి విలువ లేదా అంటూ తీవ్రంగా మండిపడ్డారు. ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డు పనులు చేపడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. నిరసనలో గుబ్బల నాగరాజు, నేదూరి శ్రీనివాసరావు, సుంకర నాగభూషణం, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ సంబరం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ పరిధిలోని తోట మెరకలో కనకదుర్గమ్మ సంబరం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, శక్తి వేషాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ సంబరం ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. గ్రామంలో భారీ ఊరేగింపు జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

అంధులు, వృద్ధులకు భోజనం అందజేత

కొత్తపేట: మండలంలోని వాడపాలెం గ్రామానికి చెందిన సాధనాల శివాజీ మంగళవారం అంధులకు, వృద్ధులకు అల్పాహారం, భోజనం సరఫరా కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన పేరున తన సోదరుల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్టు జనార్దన్ అభిమాని శివాజీ తెలిపారు.

పాస్టర్ మృతిపై అనుమానాలు నివృత్తి చేయాలి



అయినవిల్లిలో పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్స్ సంఘ నాయకులు

అయినవిల్లి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ మృతిపై ఉన్న అనుమానాలన్నీ నివృత్తి చేయాలని మండల పాస్టర్లు కోరారు. పాస్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని క్రైస్తవ సంఘాలు, నాయకులు విశ్వాసులు అధిక సంఖ్యలో ముక్తేశ్వరం రోడ్డులో నిరసన పాటించారు. అనంతరం అయినవిల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలోను, అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లోను అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యెహోషువ, ఏసు బాబ్జి, యేసుపాదం, ఎండీ ఆనంద్‌కుమార్, రత్నరాజు, ప్రకాష్‌రావు, అజిత్, తిమోతి, సాల్మన్‌రాజ్, రాజ్‌కుమార్, తొత్తరమూడి సర్పంచ్ సావిత్రి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు



కరస్పాండెంట్ సీహెచ్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్ బీనాజాన్‌లను సత్కరిస్తున్న ఉపాధ్యాయుల తల్లిదండ్రులు

అయినవిల్లి: విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవర్చుకోవడం వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్‌వీవీ ప్రసాద్, ప్రిన్సిపల్ బీనా జాన్ అన్నారు. సోమవారం పదో తరగతి విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రుల సంఘ నాయకులు అధ్యక్షతన వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. వీరు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించడానికి పదోతరగతి కీలకమైందన్నారు. పదిలో మంచి మార్కులు సాధిస్తే ఉన్నతి చదువుల్లో మెరుగైన అభివృద్ధి సాధించవచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కరస్పాండెంట్ పీహెచ్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్ బీనాజాన్‌లను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భవాని, మణి తదితరులు ఉన్నారు.

వక్ఫ్ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలి



అబ్బాస్ బాఖరి

మామిడికుదురు: ఈ నెల 3న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలని రాష్ట్ర షియా ఉలేమా బోర్డు అధ్యక్షుడు మౌలానా అబ్బాస్ బాఖరి కోరారు. నగరం గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఈ బిల్లును వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఈ బిల్లులో ప్రతిపాదించిన సవరణల ప్రకారం వక్ఫ్ సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ పెంచాలని ప్రతిపాదించారన్నారు. ఇది మతపరమైన సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ బిల్లులో వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసే నిబంధన ఉందని, ఇది వక్ఫ్ ట్రిబ్యునల్ అధికారాలను పరిమితం చేస్తుందని, న్యాయం పొందే మార్గాన్ని కష్టతరం చేస్తుందని అబ్బాస్ బాఖరి పేర్కొన్నారు. ఈ అంశాల ఆధారంగా రాష్ట్ర షియా ఉలేమా బోర్డు ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తూ టీడీపీని బిల్లును వ్యతిరేకించాలని కోరిందన్నారు.

పన్నుల వసూళ్లలో అమలాపురానికి ద్వితీయ స్థానం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో 81.28 శాతంతో జిల్లాలో ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఇంటి పన్నుల డిమాండ్ రూ.9.83 కోట్లకు మార్చి 31 నాటికి రూ.7.99 కోట్లు వసూలు చేసింది. వారం రోజులుగా పన్నుల వసూళ్లలో ప్రతి రోజూ అమలాపురం మున్సిపాలిటీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంటే గడువు తేదీ చివరి తేదీ మార్చి 31న ఒక్క రోజులో ద్వితీయ స్థానానికి చేరింది. చివరి రోజు ఒక్క రోజులో ఇంటి పన్నులు రూ.57.53 లక్షలు, ఖాళీ స్థలం పన్నులు రూ.10.47 లక్షలు, కుళాయి పన్నులు రూ.2.81 లక్షలు, షాపుల అద్దెలు రూ.5.11 లక్షలతో మొత్తం రూ.75.92 లక్షలు వసూలు చేశారని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. మున్సిపల్ షాపులకు డిపాజిట్లు, అద్దెల బకాయిలు కేవలం ఒకే నెలలో (మార్చి 1 నుంచి 31వ తేదీ వరకూ) రూ.37.43 లక్షలు వసూలు చేయడం జరిగిందన్నారు. మార్కెట్ కిస్తీ పాటకు సంబంధించి గతేడాది కంటే రూ.3.37 లక్షల మేర మున్సిపాలిటీకి ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో జిల్లాలో ద్వితీయస్థానం సాధించినందుకు కమిషనర్ రాజు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు శ్రమించిన మున్సిపల్ రెవెన్యూ అధికారిణి భూపతి శ్రీలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, 15 వార్డు సచివాలయాల అడ్మిన్లు, సెక్రటరీలను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. పన్నుల చెల్లింపునకు చివరి గడువు రోజైన మార్చి 31వ తేదీ రాత్రి అర్ధరాత్రి వరకూ పన్నుల వసూళ్లను ప్రత్యేక డ్రైవ్‌తో నిర్వహించామని రెవెన్యూ అధికారిణి శ్రీలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


సేంద్రియ సాగుతో మానవాళికి మేలు



పుల్లేటికుర్రులో రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన కిట్లు

అంబాజీపేట: సేంద్రియ పద్ధతిలో సాగు చేసే పంటలతో మానవాళికి ఎంతో మేలు చేకూర్చడమే కాకుండా ఆరోగ్యకరంగా ఉంటాయని ప్రకృతి వ్యవసాయ ఏఓ శ్రీనివాసరావు అన్నారు. పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన సేంద్రియ పీఎండీఎస్ విత్తనాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ విభాగం ద్వారా పీఎండీఎస్ విత్తనాలు మొదటి విడతగా ఎకరానికి 12 కేజీల చొప్పున 150 కిట్లను రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులు దాళ్వా పంటలు అనంతరం భూమి పోషకాల పెంపుదలకు, పశువులకు నాణ్యమైన పైరు పొందవచ్చన్నారు. రూ.900లు విలువ చేసే 10 కేజీల కిట్‌లను రైతులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఏఏ పాండు, ఎంటీ జె.నాగవేణి, యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ శ్యామల, డీఎంఎంటీ ఎస్.శ్రీనివాసరావు, ఫార్మర్ సైంటిస్ట్ ఎస్.ఫణిరాజు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

గోదావరి ఫుట్‌బాల్ టీమ్‌లో నరేంద్రకుమార్ ప్రతిభ



ఫుట్‌బాల్ క్రీడాకారుడు నరేంద్రకుమార్

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో అనంతపురం మైదానంలో గత నెల 20 నుంచి 28వ తేదీ వరకూ నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)లోని క్రీడాకారుడైన అమలాపురానికి చెందిన రెడ్డి నరేంద్రకుమార్ ప్రతిభ చూపాడు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం తొలిసారిగా ఫ్రాంచైజీ విధానంలో నిర్వహించిన ఏపీ సూపర్ కప్ టైటిల్‌ను గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ కైవసం చేసుకుంది. ఈ క్లబ్ తరపున ఆడిన 11 మంది ఫుట్‌బాల్ క్రీడాకారుల్లో నరేంద్రకుమార్ ఒకరు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి కుమారుడు నరేంద్రకుమార్. ఫైనల్‌లో గోదావరి ఎఫ్‌సీ జట్టు 2–1 స్కోరుతో కొల్లేరు ఎఫ్‌సీ జట్టుపై విజయం సాధించిందని నరేంద్రకుమార్ తెలిపారు. ఈ పోటీల్లో తమ జట్టు విన్నర్‌గా నిలిచి టైటిల్‌తో పాటు రూ.5 లక్షల నగదు బహుమతి గెలిచిందని నరేంద్రకుమార్ వివరించారు. ఈ విజయంతో గోదావరి జట్టు జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఐ–లీగ్ 3కి అర్హత సాధించిందని చెప్పారు. త్వరలోనే ఒడిశాలో ఐ–లీగ్ ప్రారంభమవుతుందని నరేంద్రకుమార్ తెలిపారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త



అంబాజీపేటలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

అంబాజీపేట: మండే ఎండల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి కె.శ్రీనివాస్ సూచించారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా వైద్యాధికారులు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం 38–40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్, (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా (విరేచనాలు), వడదెబ్బ తదితర సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణాధారం. ప్రజలు సాధ్యమైనంత వరకు కొబ్బరి నీరు తీసుకోవాలి.

ఎండలో పని చేస్తే...

ప్రజలు వేసవి కాలంలో వీలైనంతగా పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడ దెబ్బకు గురైన బాధితులను శీతల ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడి గుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

వేసవిలో చేయకూడనివి

మండు వేసవిలో ఎక్కువగా తిరగరాదు. మద్యం తాగరాదు. రోడ్ల మీద చల్లని రంగు పానీయాలు తాగఋడం, కలుషిత ఆహారం తినరాదు. వేసవిలో మాంసాహారం తగ్గించాలి. నూనెలో వేసిన ఆయిల్ ఫుడ్ తినకూడదు. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి. భోజనం మితంగా చేయాలి లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి. చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి. తాజా కాయగూరలు, ఎక్కువగా తీసుకోవాలి. ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలి.

వడదెబ్బకు ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఐస్ నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి. లేని పక్షంలో గ్లూకోజు, ద్రావణం తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.